సాక్షి అనంతపురం

మంగళవారం । 4 । జూన్ । 2024



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి.



వైభవం.. రథోత్సవం

బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులో పాండురంగస్వామి రథోత్సవం సోమవారం అత్యంత వైభవంగా సాగింది.

8లో

గరిష్టం/కనిష్టం
32.6°/ 22.4°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షపాతం నమోదైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

2 వేల మంది పోలీసులతో పహారా

అనంతపురం: కౌంటింగ్ సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.ఓట్ల లెక్కింపు జరగనున్న జేఎన్‌టీయూ వద్ద రెడ్‌జోన్‌గా ప్రకటించారు. 2 వేల మంది పోలీసులతో పహారా ఏర్పాటు చేశారు. వెయ్యి మంది ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను రంగంలోకి దించారు. వీరితో పాటు అదనంగా 26 ప్లటూన్ల సీఆర్‌పీఎఫ్ బలగాలను తీసుకొచ్చారు. 18 మంది డీఎస్పీలు, 60 మంది సీఐలు, 90 మంది ఎస్‌ఐలు బందోబస్తు విధుల్లో ఉండనున్నారు. అలాగే, జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. నగరంలోని ప్రధాన కూడళ్ల, సరిహద్దుల్లో పోలీసు పికెట్లతో పాటు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ పార్టీలను ఏర్పాటు చేశారు.

జేఎన్‌టీయూ చుట్టూ నిఘా

జేఎన్‌టీయూ చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. డ్రోన్లతో నిఘా చేపట్టనున్నారు. బయటి వ్యక్తులు డ్రోన్లు వినియోగించకుండా నిషేధం విధించారు. స్థానికంగా ఉండే హోటళ్లు, దుకాణాలు మంగళవారం బంద్ చేయాలని ఇప్పటికే నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలు తమ ఇళ్లలోకి కొత్తవారు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

ఇళ్లలోనే ఉండండి

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జనం రోడ్ల మీదకు రాకుండా సాధ్యమైనంత వరకూ ఇళ్లలోనే ఉండాలని అనంతపురం అర్బన్ డీఎస్పీ టీవీవీ ప్రతాప్ అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సర్కిల్‌లోని మన్రో విగ్రహం వద్ద నుంచి కౌంటింగ్ కేంద్రం వరకు బారికేడ్లతో పాటు భైరవ నగర్ వైపు, మన్రో విగ్రహం దాటిన తరువాత (జేఎన్‌టీయూ వైపు), చిన్మయ నగర్‌లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. బిల్డింగులపై నుంచి బైనాక్యులర్స్‌తో పోలీసులు పర్యవేక్షిస్తారన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీ కార్యకర్తలే కాకుండా, వారిని ప్రోత్సహించే నాయకులపైనా కేసులు పెడతామన్నారు. జిల్లా బహిష్కరణకూ వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. తాడిపత్రి ఘటనలో పరారీలో ఉన్న నిందితుల ఫొటోలను రైల్వే స్టేషన్, బస్టాండు ప్రాంతాల్లో అతికించడంతో పాటు లాడ్జిలు, చెక్‌పోస్టుల్లో అందజేశామని, వారి ఆచూకీ తెలిస్తే సమాచారమివ్వాలని కోరారు.

పాస్ లేకుంటే నో ఎంట్రీ



జేఎన్‌టీయూ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

అనంతపురం: పాస్ లేని వారిని కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించరాదని ఎస్పీ గౌతమి శాలి అన్నారు. బందోబస్తులో పాల్గొంటున్న పోలీసు అధికారులతో జేఎన్‌టీయూలో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అప్పగించిన విధులను పక్కాగా నిర్వర్తించాలన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు, చీఫ్ ఏజెంట్లు, ఆర్‌ఓ, ఏఆర్‌ఓ, ఇతర అధికారులు, మీడియా ప్రతినిధులు నిర్దేశిత మార్గాల ద్వారానే కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లేలా చూడాలని ఆదేశించారు.

నేడే కౌంటింగ్

- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- నిఘా నీడలో జేఎన్‌టీయూ
- జిల్లావ్యాప్తంగా పకడ్బందీ బందోబస్తు

కౌంటింగ్ జరిగే ప్రదేశం
జేఎన్‌టీయూ

ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యే సమయం
ఉదయం 8 గంటలు

ఈవీఎం ఓట్ల లెక్కింపు
8. 30 నుంచి

కౌంటింగ్ కేంద్రాలిలా...

జేఎన్‌టీయూ ప్రధాన భవనం
రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి అసెంబ్లీ, అనంతపురం పార్లమెంటు నియోజకవర్గాలు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

ఈసీఈ డిపార్ట్‌మెంట్ భవనం
అనంతపురం అర్బన్, రాప్తాడు అసెంబ్లీ

పరిపాలన భవనం
ఉరవకొండ, కళ్యాణదుర్గం, శింగనమల



జేఎన్‌టీయూ వద్ద పోలీసు పహారా



పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కేంద్రం

అనంతపురం అర్బన్: జిల్లా ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది. టెన్షన్ వాతావరణానికి తెరపడనుంది. సార్వత్రిక ఎన్నికల సమరంలో తుది ఘట్టమైన ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనుంది. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం నేటితో తేలిపోనుంది. కౌంటింగ్ నిర్వహణకు జిల్లా యంత్రాగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. శాంతియుత వాతావరణంలో ప్రక్రియ సాగేలా పటిష్ట చర్యలు తీసుకుంది.

పోలీసు వలయంలో జేఎన్‌టీయూ

కౌంటింగ్ జరగనున్న జేఎన్‌టీయూను పోలీసులు అష్టదిగ్బంధనం చేశారు. చిన్నపాటి గొడవలకూ ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్ర, ఏఆర్, సివిల్ ఫోర్స్‌ను రంగంలోకి దించారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ తదితర సుశిక్షితులైన బలగాలను కూడా ఉంచారు. వీరితో పాటు వజ్ర వాహనం, లాఠీ చార్జీ చేసే బలగాలు, ఇతర బలగాలు సిద్ధంగా ఉంటాయి.

జిల్లా అంతటా హైఅలర్ట్

కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా అంతటా హై అలర్ట్ ప్రకటించారు. 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలు చేస్తున్నారు. మండలకేంద్రాల్లోని తహసీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 315 సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు. ఆయా గ్రామాల్లో అధికారులను అప్రమత్తం చేశారు. అక్కడి పరిస్థితులపై సమాచారం గంటకోకసారి మండల కంట్రోల్ రూమ్‌కు, అక్కడి నుంచి జిల్లా కంట్రోల్ రూమ్‌కు వచ్చేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని 280 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కలెక్టరేట్, జేఎన్‌టీయూ, ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. అదే విధంగా ప్రతి నియోజకవర్గంలోనూ డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

ప్రత్యేకంగా ముగ్గురు పరిశీలకులు

కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు ప్రత్యేకంగా ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించింది. అనంతపురం అర్బన్, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కౌంటింగ్ పరిశీలకునిగా మనీష్ సింగ్, ఉరవకొండ, కళ్యాణదుర్గం, శింగనమల అసెంబ్లీ నియోజకవర్గాలకు సి.అజయ్‌నాథ్ ఝు, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గాలకు కౌంటింగ్ పరిశీలకునిగా అజయ్‌కుమార్‌ను నియమించారు.

కౌంటింగ్ సాగనుందిలా..

- కౌంటింగ్ సిబ్బందికి సంబంధించి ఉదయం 5 గంటలకు ర్యాండమైజేషన్ నిర్వహిస్తారు. అటు తరువాత వారికి టేబుళ్ల కేటాయిస్తారు.
- ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రవేశం కల్పిస్తారు. ఉదయం ఏడు గంటల్లోగా కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు కౌంటింగ్ భవనంలో ఉండాలి. అటు తరువాత లోనికి అనుమతించరు.
- ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభించి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు చేపడతారు. 30 నిమిషాల తరువాత ఈవీఎం ఓట్ల లెక్కింపు మొదలుపెడతారు.
- అనంతపురం పార్లమెంట్‌కు సంబంధించి అసెంబ్లీకి 14 చొప్పున ఏడు నియోజకవర్గాలకు 112 టేబుళ్ల ఏర్పాటు చేశారు.
- అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఉరవకొండకు 18, మిగిలిన ఏడు నియోజకవర్గాలకు 14 చొప్పున మొత్తం 116 టేబుళ్ల ఏర్పాటు చేశారు.
- ఒక్కో ఈవీఎం రౌండ్ లెక్కింపునకు మొదట 30 నిమిషాలు పడుతుంది. తరువాత రౌండ్ నుంచి 20 నిమిషాలకు తగ్గుతుంది.
- కౌంటింగ్ పూర్తయిన తరువాత ఆ నియోజకవర్గానికి సంబంధించి లాటరీ పద్ధతిలో ఎంపిక చేసిన ఐదు పోలింగ్ కేంద్రాల వీవీ ప్యాట్ స్లిప్‌లను లెక్కిస్తారు. ఆ తరువాత నియోజకవర్గం తుది ఫలితం ప్రకటిస్తారు.
- ఉరవకొండ అసెంబ్లీకి 18 టేబుళ్ల ద్వారా 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపడతారు. దీంతో ఈ నియోజకవర్గ ఫలితం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట మధ్యలో వచ్చే అవకాశం ఉంది.
- అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్లు 6,971 ఉన్నాయి. వాటి లెక్కింపునకు ఐదారు గంటలు పట్టవచ్చు. అది పూర్తయిన తరువాత అనంతపురం నియోజకవర్గ ఫలితాలు సాయంత్రం 6.30 గంటలకు వెల్లడి కావొచ్చు.
- అన్ని నియోజవర్గాలకు సంబంధించి తుది ఫలితాలు మంగళవారం రాత్రికి వెలువడే అవకాశం ఉంది.

ఈసీ మార్గదర్శకాలు పాటించాలి

- సిబ్బందికి పరిశీలకులు మనీష్ సింగ్, అజయనాథ్, అజయ్‌కుమార్ సూచన

అనంతపురం అర్బన్: 'వివాదాలకు తావివ్వకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనలు తప్పక పాటించాలి' అని కౌంటింగ్ పరిశీలకులు మనీష్ సింగ్, అజయ్‌నాథ్ ఝు, అజయ్‌కుమార్ కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్ కుమార్‌తో కలిసి సోమవారం వారు జేఎన్‌టీయూని సందర్శించారు. కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కౌంటింగ్ సిబ్బందితో వారు మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో ఎవరి ప్రభావానికి లోనుకాకుండా నిక్కచ్చిగా వ్యవహరించాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, జెడ్పీ సీఈఓ వైభోమ్ నిదియాదేవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.వి నూత్న, రిటర్నింగ్ అధికారులు రాణి సుస్మిత, శ్రీనివాసులురెడ్డి, వసంతబాబు, వెన్నల శ్రీను, వెంకటేష్, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం

అనంతపురం అర్బన్: కౌంటింగ్ ప్రక్రియను సవాల్‌గా తీసుకుని సమష్టిగా పనిచేసి విజయవంతం చేద్దామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. కౌంటింగ్ ప్రక్రియపై కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులు, తహసీల్దార్లు, కౌంటింగ్ సిబ్బందితో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటి వరకు సమవర్థంతంగా పనిచేశారని కితాబునిచ్చారు. అదే స్ఫూర్తితో రానున్న 24 గంటలు అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో పోర్టబుల్ పబ్లిక్ అడ్రెస్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలన్నారు.

నలుగురిపై జిల్లా బహిష్కరణ వేటు

అనంతపురం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ముందు, అనంతరం గొడవల్లో పాల్గొన్న నలుగురిపై జిల్లా బహిష్కరణ వేటు పడింది. ఈ మేరకు ఎస్పీ గౌతమి శాలి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం నగరానికి చెందిన టీడీపీ నాయకుడు, చంద్ర దండు పి. ప్రకాష్ నాయుడు, ఆత్మకూరు మండలం బి.యాలేరుకు చెందిన బండి పరుశురాం, తోపుదుర్తికి చెందిన పాలచర్ల పోతులయ్య, ఓబిరెడ్డి బహిష్కరణ వేటు పడిన వారిలో ఉన్నారు.



జేఎన్‌టీయూ సమీపంలో పోలీసులు ఏర్పాటు చేసిన ఇనుప కంచె



బందోబస్తు గురించి పరిశీలకులకు వివరిస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్,



ఈవీఎం ఓట్ల లెక్కింపు కేంద్రం

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

పెద్దవడుగూరు: ఓట్ల లెక్కింపు సందర్భంగా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఐజీ రాహుల్‌దేవ్‌శర్మ అన్నారు. ఇటీవల పోలింగ్ సందర్భంగా తాడిపత్రిలో జరిగిన గొడవల నేపథ్యంలో నియోజకవర్గ పరిశీలన నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేకంగా డీఐజీ రాహుల్‌దేవ్ శర్మను నియమించింది. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన పెద్దవడుగూరు పోలీసుస్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలపై ఆరా తీశారు. అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

యాడికి: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఐజీ రాహుల్ దేవ్ శర్మ అన్నారు. సోమవారం మండలంలోని పోలీసు స్టేషన్‌ను డీఐజీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై సీఐ నాగార్జున రెడ్డితో ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 6 వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎక్కడా ప్రజలు గుమిగూడరాదన్నారు.ఇప్పటికే మండల వ్యాప్తంగా 541 మందిని బైండోవర్ చేశామన్నారు. 114 మందిపై రౌడీషీట్ తెరిచామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జిల్లా బహిష్కరణ చేస్తామన్నారు. ఏ పార్టీ గెలిచినా సంబరాలు చేసుకోరాదన్నారు.



యాడికి పోలీసుస్టేషన్‌లో సీఐ నాగార్జున రెడ్డితో మాట్లాడుతున్న డీఐజీ రాహుల్ దేవ్ శర్మ

ముమ్మరంగా వాహన తనిఖీలు

అనంతపురం: కౌంటింగ్ సందర్భంగా నగరంలో సోమవారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎస్పీ ఆదేశాలతో నగరంలోకి ప్రవేశించే మార్గాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్, ప్రధాన కూడళ్ల తదితర చోట్ల కూడా తనిఖీలు సాగించారు. అనుమానితులు, అపరిచితులు జిల్లా కేంద్రంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మారణాయుధాలు, పేలుడు పదార్థాలు, మద్యం అక్రమంగా తరలించకుండా చర్యలు చేపట్టారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మెరుగైన వైద్యం.. సత్వరం!

- జీజీహెచ్‌లో 'ఎమర్జెన్సీ మెడిసిన్' యూనిట్
- ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్లతో ఏర్పాటు
- ఈ నెల 10 నుంచి ప్రారంభం

అనంతపురం మెడికల్: ప్రాణాపాయ స్థితిలో ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చే క్షతగాత్రులు, రోగులకు సకాలంలో తగిన వైద్యం అందించేందుకు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 10 నుంచి ఎమర్జెన్సీ వార్డును 'ఎమర్జెన్సీ మెడిసిన్'గా మార్చనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ క్రమంలోనే సోమవారం జీజీహెచ్‌లో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం, మెడిసిన్, సర్జరీ, ఆర్థో, అనస్థీషియా ప్రొఫెసర్లు, వైద్యులు, సీనియర్ రెసిడెంట్లతో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు సమావేశం నిర్వహించారు. విభాగంలో మౌలిక సదుపాయాల కల్పన, వైద్యుల విధులు తదితర విషయాలపై చర్చించారు.

900 వరకూ అత్యవసర కేసులే..

రోడ్డు ప్రమాదాలు, విషం తాగడం, గుండె పోటు తదితర కేసులకు అత్యవసర చికిత్స అవసరం. అలాంటి కేసులు ఆస్పత్రికి వచ్చినప్పుడు రోగానికి సంబంధించిన వైద్య విభాగానికి వెంటనే ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం వైద్యులు రెఫర్ చేసి, మెరుగైన సేవలందించేలా చూస్తారు. సర్వజనాస్పత్రిలో రోజూ 2,500 మంది ఓపీ సేవలు వినియోగించుకుంటే.. అందులో 900 మంది వరకు ఎమర్జెన్సీ వార్డుకు వస్తుంటారు. వారికి ఇకపై వీలైనంత త్వరగా మెరుగైన వైద్యం అందించేందుకు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం దోహదపడనుంది.



ప్రభుత్వ సర్వజనాస్పత్రి

కూర్పు ఇలా..

ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలో ఒక ప్రొఫెసర్, అసోసియేట్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉంటారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వీరు అందుబాటులో ఉంటారు. అనంతరం కాల్ డ్యూటీపై విధులు నిర్వర్తిస్తారు. వీరి పర్యవేక్షణలో 9 మంది క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు, సర్జరీ, ఆర్థో, అనస్థీషియా పీజీ వైద్యులు విధులు నిర్వర్తించనున్నారు.

ఈ నెల 10 నుంచి ప్రారంభం



ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాన్ని ఈ నెల 10 నుంచి ప్రారంభిస్తాం. ఇప్పటికే ఆస్పత్రిలోని వివిధ విభాగాధిపతులు, వైద్యులతో సమావేశాలు నిర్వహించాం. సాధ్యాసాధ్యాలపై సుదీర్ఘంగా చర్చించాం. ఇకపై అత్యవసర పరిస్థితిలో ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందుతుంది.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

విస్తారంగా వర్షాలు

- 'నైరుతి' ప్రవేశంతో జిల్లా అంతటా వాన
- 31 మండలాల పరిధిలో 31.7 మి.మీ సగటు వర్షపాతం నమోదు

అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాలు అలా ప్రవేశించగానే వరుణుడు ఇలా భారీ వర్షం కురిపించాడు. అనుకున్నదాని కన్నా రెండు రోజులు ముందుగానే రుతుపవనాలు విస్తరించడంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఉరుములు, మెరుపులతో వర్షం మొదలై తెల్లవారుజాము వరకూ మోస్తరు నుంచి భారీగా నమోదైంది. 31 మండలాల పరిధిలో ఏకంగా 31.7 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. బొమ్మనహాళ్ మండలంలో 91 మి.మీ, బెళుగుప్ప 84.2 మి.మీ, కణేకల్లు 80 మి.మీ, గుత్తి 62.6 మి.మీ మేర భారీ వర్షపాతం నమోదైంది. అలాగే పెద్దవడుగూరు 56.2 మి.మీ, ఆత్మకూరు 50.4 మి.మీ, డి.హీరేహాళ్ 50 మి.మీ, కూడేరు 46.2 మి.మీ, రాయదుర్గం 43.2 మి.మీ, నార్పల 42.4 మి.మీ, రాప్తాడు 40.4 మి.మీ, గార్లదిన్నె 37.8 మి.మీ, పామిడి 35.4 మి.మీ, వజ్రకరూరు 35.2 మి.మీ, యాడికి 32 మి.మీ, శింగనమల 30.8 మి.మీ, కళ్యాణదుర్గం 23.4 మి.మీ, అనంతపురం 23 మి.మీ, బుక్కరాయసముద్రం 22 మి.మీ మేర పదును వర్షం కురిసింది. మిగతా అన్ని మండలాల్లో మోస్తరుగా వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి 2024–25 వర్షపాతం సంవత్సరం ప్రారంభం కాగా మొదటి మూడు రోజుల్లోనే 45.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

పొంగిన వాగులు, వంకలు

సీజన్ ప్రారంభమైన మొదట్లోనే ఒకే రోజు ఏకంగా 31.7 మి.మీ సగటు రికార్డు వర్షపాతం నమోదు కావడం గమనార్హం. గతేడాది ఒకసారి కూడా ఒకే రోజు ఈ స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదు. చాన్నాళ్ల తర్వాత విస్తారంగా వర్షాలు పడటంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగి ప్రవహించాయి.

ఉద్యానం.. ఉపశమనం

ఒక వైపు వర్షాభావం, మరోవైపు మూడు నెలల పాటు భానుడి భగభగల కారణంగా చీనీ, మామిడి, అరటి ఇతర ఉద్యాన పంటల రైతులు పంటలను కాపాడుకునేందుకు ఇబ్బంది పడ్డారు. తాజాగా కురిసిన వర్షంతో ఉద్యాన పంటలకు ఊపిరిపోసినట్లయింది. పట్టు, పశుపోషణ, పశుగ్రాసానికి ఇబ్బంది లేకుండా పోయింది. ఖరీఫ్‌పై రైతుల్లో ఆశలు చిగురించాయి. ముందస్తుగా నీటి వసతి కింద వర్షాధారంగా అక్కడక్కడా రైతులు విత్తు మొదలు పెట్టే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జూన్ 15 నుంచి జూలై నెలంతా వేరుశనగ, పత్తి, కంది, ఆముదం, తదితర అన్ని రకాల ఖరీఫ్ పంటలు సాగు చేసుకునేందుకు అనుకూల సమయమని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ, 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు, రాగులు, కొర్రలు, 30 శాతం రాయితీతో కందులు, మినుములు, పెసల పంపిణీ కార్యక్రమం చేపట్టడంతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు. ఇటీవల రూ.251 కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేయడం , పంట రుణాల పంపిణీ జోరుగా సాగుతున్నందున సాగుకు కొందరు రెడీగా ఉన్నారు.



కణేకల్లు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదవతి హగరి నది



ఉద్దేహాళ్ వద్ద బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద నీరు



కూడేరు: వర్షం నీటితో కళకళలాడుతున్న ముద్దలాపురం చెరువు



రాప్తాడు మండలం అయ్యవారిపల్లి వద్ద పరవళ్లు తొక్కుతున్న పండమేరు వంక

జిల్లాకు వర్షసూచన

రాగల మూడు రోజులు జిల్లాకు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణ స్వామి తెలిపారు. అక్కడక్కడా 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని, ఒకట్రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడవచ్చన్నారు. నైరుతి రుతుపవనాల విస్తరణకు అనుకూల వాతావరణం, దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు తీరాలకు ఆనుకుని సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు వివరించారు.

ఓటింగ్ ముగిసింది.. తో(టో)ల్ తీస్తున్నారు

- దేశవ్యాప్తంగా ఓటింగ్ ప్రక్రియ ముగియగానే టోల్ ధరల పెంపు
- ఆదివారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి
- సగటున 5 శాతం పెంచినట్లు ప్రకటించిన ఎన్‌హెచ్ఏఐ
- కేంద్రం తీరుపై వాహనదారుల విమర్శలు



రాప్తాడు మండలం మరూరు వద్ద ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా

హిందూపురం అర్బన్: టోల్ చార్జీలు వాహనదారులకు మరింత భారమయ్యాయి. ప్రస్తుతమున్న చార్జీలకు సగటున 5 శాతం పెంచినట్లు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) ప్రకటించింది. పెంచిన చార్జీలు ఆదివారం అర్ధరాత్రి నుంచే అమలులోకి తీసుకువచ్చింది.

ఎన్నికల నేపథ్యంలో ఆలస్యంగా...

వాస్తవానికి ఏటా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త టోల్ రేట్లను అమలులోకి తెస్తారు. కానీ ఈసారి లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. టోల్ ధరలను పెంచకుండా కేంద్రంలోని మోదీ సర్కార్ తొక్కిపెట్టింది. ఈ క్రమంలో ఈ నెల 1న దేశవ్యాప్తంగా ఓటింగ్ ప్రక్రియ ముగిసింది. దీంతో 2వ తేదీన టోల్ చార్జీలను పెంచుతూ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థ పెంచిన ధరలకు అనుగుణంగా టోల్ కాంట్రాక్ట్ దక్కించుకున్న నిర్వాహకులు ఐదు శాతం మేర టోల్ చార్జీలు పెంచి ఆదివారం అర్ధరాత్రి నుంచి వసూలు చేయడం మొదలు పెట్టారు. ఈ లెక్కన కనిష్టం రూ.5 నుంచి గరిష్టంగా రూ.40 వరకూ చార్జీలు పెరిగాయి. కార్లు, ట్రక్కులు, బస్సులు, భారీ వాహనాలు, ఇతర వాణిజ్య వాహనాలపై వాటి ఇంజన్ సామర్థ్యాన్ని బట్టి ధర నిర్ణయించారు.

ఉమ్మడి జిల్లా వాసులపై రూ.60 లక్షల అదనపు భారం..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 8 టోల్ ప్లాజాలు ఉండగా, రోజూ 13 వేల నుంచి 14 వేల వరకూ వాహనాలు ఆయా టోల్‌ప్లాజాల మీదుగా సంచరిస్తున్నాయి. టోల్ సుంకం ద్వారా నెలకు రూ.15కోట్ల మేర రాబడి కేంద్రానికి వెళుతోంది. ఉమ్మడి జిల్లాలోని 44వ జాతీయ రహదారిపై రాప్తాడు మండలం మరూరు, పెద్దవడుగూరు మండలం కాసేపల్లి (గుత్తి సమీపంలో) టోల్‌ప్లాజాలు ఉన్నాయి. వీటి ద్వారా పెంచిన యూజర్ ఛార్జీలు లెక్కించుకుంటే నెలకు రూ.60 లక్షలు చొప్పున జిల్లా వాసులపై అదనపు భారం పడుతోంది. మరూరు టోల్ ప్లాజా వద్ద కారు, జీపు, లైట్ మోటార్ వాహనాలకు గతంలో ఒక వైపు రూ.135 వసూలు చేసేవారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి రూ.140 వసూలు చేస్తున్నారు. రానుపోనుకైతే వసూలు చేస్తున్న రూ.200ను రూ.210కు పెంచారు. మిగిలిన వాహనాల సామర్థ్యాన్ని బట్టి రూ.10 నుంచి రూ.40 వరకు చార్జీల భారం పెరిగింది.

మరూరు టోల్‌ప్లాజాలో చార్జీలు ఇలా....

వాహనం	సింగల్		రానుపోను	
	పాత చార్జీ	కొత్త చార్జీ	పాత చార్జీ	కొత్త చార్జీ
కారు, జీపు, వ్యాన్, ఎల్ఎంవీ	రూ.135	రూ.140	రూ.205	రూ.210
లైట్, గూడ్స్, మినీగూడ్స్	రూ.220	రూ.225	రూ.330	రూ.335
బస్సు, ట్రక్కు	రూ.460	రూ.470	రూ.690	రూ.705
త్రీ యాక్సిల్ వాణిజ్య వాహనం	రూ.500	రూ.515	రూ.750	రూ.770
4-6 యాక్సిల్ వాహనాలు	రూ.720	రూ.740	రూ.1,080	రూ.1,105
భారీ వాహనం	రూ.875	రూ.900	రూ.1,315	రూ.1,350

కాసేపల్లి టోల్ ప్లాజా వద్ద పెరిగిన ధరలు ఇలా..

కారు, జీపు, ఎల్ఎంవీ వాహనాలకు ఒక వైపు రూ.125 రెండు వైపులా రూ.190 కాగా, లైట్ కమర్షియల్, గూడ్స్ వాహనాలకు ఒకవైపు రూ. 205, ఇరువైపుల రూ. 305, బస్సు, ట్రక్కులకు సింగల్ రూ.425, ఇరువైపులా రూ.640, త్రీ యాక్సిల్ కమర్షియల్ వాహనాలకు సింగల్ రూ.465 , ఇరువైపులా రూ.700, 4-6 యాక్సిల్ వాహనాలకు ఒక వైపు రూ.670, ఇరువైపులా రూ.1,005, భారీ వాహనాలకు ఒకవైపు రూ.815, ఇరువైపులా రూ.1,220 చొప్పున వసూలు చేస్తున్నారు.

క్లుప్తంగా

పెన్నహోబిలంలో హుండీ కానుకల లెక్కింపు


హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ముగిసిన నేపథ్యంలో ఆలయంలోని ఆరు హుండీల్లోని భక్తుల కానుకల లెక్కింపు ప్రక్రియను సోమవారం చేపట్టారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి 17 రోజులకు గాను రూ.17,21,128 ఆదాయం సమకూరింది. గతంలో ఎన్నడూ లేని విధంగా 17 రోజులకే ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరడం విశేషమని ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్, బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి బి.అక్కిరెడ్డి అన్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య


శిల్ప (ఫైల్)

బొమ్మనహాళ్ / బెళుగుప్ప: అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని చిత్రదుర్గం జిల్లాకు చెందిన శిల్ప (28)కు పదేళ్ల క్రితం బెళుగుప్ప మండలం నక్కలపల్లికి చెందిన మంజునాథ్‌తో వివాహమైంది. కొంత కాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం గుండ్లపల్లి గ్రామానికి మకాం మార్చారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునే మంజునాథ్ కొంత కాలంగా శిల్పపై అనుమానం పెంచుకుని ఆమెను వేధిస్తూ వచ్చాడు. అత్తమామ సైతం కోడలిదే తప్పు అన్నట్లుగా మాట్లాడుతూ నిందలు వేశారు. దీంతో మనస్తాపం చెందిన శిల్ప ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను కుటుంబసభ్యులు వెంటనే కళ్యాణదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. అత్తింటి వారి వేధింపులు తాళలేకనే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందంటూ శిల్ప తల్లి లక్ష్మీదేవి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

- ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఒత్తిడికి గురి కావడమే కారణమంటున్న బంధువులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి (ఇన్‌సెట్) మల్లికార్జున (ఫైల్)

ఉరవకొండ: మండలంలోని పెద్ద ముష్టూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మీనుగ మల్లికార్జున అలియాస్ అర్జున (55) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన మేరకు ఈ నెల 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాలపై మూడు రోజులుగా గ్రామస్తులతో మల్లికార్జున తీవ్ర స్థాయిలో చర్చించాడు. ఈ నెల 1న వెలువడిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఎంతో ఆసక్తితో గమనించాడు. ఇదే అంశంపై సోమవారం తన సోదరుడి ఇంట్లో కూర్చొని చర్చిస్తూ ఒక్కసారిగా ఛాతిలో నొప్పిగా ఉందంటూ కుప్పకూలాడు. కుటుంబసభ్యులు వెంటనే ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో పెద్ద ముష్టూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పెద్దముష్టూరుకు చేరుకుని మల్లికార్జున మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

అల్లర్లకు పాల్పడితే రౌడీ షీట్ తెరుస్తాం

- జిల్లా అదనపు ఎస్పీ విజయ భాస్కరరెడ్డి


గుంతకల్లులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న ఏఎస్పీ విజయభాస్కరరెడ్డి, సిబ్బంది

గుత్తి: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అందరూ ప్రశాంతంగా ఉండాలని, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేయడంతో పాటు అవసరమైతే జిల్లా బహిష్కరణ వేటు వేస్తామని జిల్లా అదనపు ఎస్పీ విజయభాస్కరరెడ్డి హెచ్చరించారు. గుత్తి పోలీసుస్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్‌తో కలసి విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇప్పటికే అల్లర్లకు పాల్పడిన 400 మందిపై రౌడీ షీట్ ఓపెన్ చేసినట్లు గుర్తు చేశారు. వీరిలో 30 మందిపై జిల్లా బహిష్కరణ వేటు వేశామన్నారు. నియోజకవర్గం నుంచి ఏ పార్టీకి చెందిన నాయకులైనా, కార్యకర్తలైనా అనవసరంగా జిల్లా కేంద్రానికి వెళ్లకూడదన్నారు. అలా వెళ్లాలని ప్రయత్నిస్తే చర్యలు తప్పవన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

గుంతకల్లు టౌన్: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఈసీ నిబంధనలు ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని లేకపోతే కఠినమైన చర్యలు తప్పవని అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం కేంద్ర బలగాలతో కలసి గుంతకల్లులోని ప్రధాన వీధుల్లో ఆయన ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 144 సెక్షన్, 30పోలీస్ యాక్ట్ అమల్లో ఉందన్నారు. ప్రజలు అకారణంగా గుమికూడి రోడ్లపైకి రావొద్దన్నారు. ఫలితాలు వెలువడిన అనంతరం రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీలు, సభలు నిర్వహించరాదన్నారు. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నెకు చెందిన యువకుడు నవీన్‌కుమార్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. ఓ మైనర్ బాలికను తనతో పాటు పిలుచుకెళ్లి తిరుపతిలో నాలుగు రోజులు గడిపినట్లుగా బాలిక తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. సోమవారం ఉదయం నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు.

వైభవం... పాండురంగడి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో రుక్మిణీపాండురంగస్వామి మూలవిరాట్, రథాన్ని లాగుతున్న భక్తులు

బొమ్మనహాళ్: ఆంధ్ర పండరీపురంగా ప్రసిద్ధి చెందిన బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులో వెలసిన రుక్మిణీ పాండురంగ స్వామి రథోత్సవం సోమవారం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం 6 గంటలకు ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అఖండ దీపం వెలిగించి, స్వస్తి పుణ్యాహావచనం, వాస్తు మంటపారాధన, మహాగణపతి, నవగ్రహ, వాస్తు, లక్ష్మీనారాయణ హోమాలు జరిగాయి. పూర్ణాహుతి అనంతరం సాయంత్రం 5.30 గంటలకు మహారాష్ట్రలోని పండరీపురం నుంచి విచ్చేసిన పీఠాధిపతి గోపాల్ మహారాజ్ ఆధ్వర్యంలో రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఆంధ్ర, కర్ణాటక , మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఉంతకల్లు జనసంద్రమైంది. రథోత్సవం ముందు వార్కరీ సంప్రదాయాన్ని అనుసరిస్తూ నిర్వహించిన పండరీ భజన ఆకట్టుకుంది. సాయంత్రం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అంధుల ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరిగి మండలంలోని సేవామందిరం ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు అర్హులైన దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు ఆ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకూ అడ్మిషన్లు కల్పించనున్నారు. మొత్తం 150 సీట్లకు గాను ఇప్పటి వరకూ వివిధ తరగతుల్లో 52 మంది విద్యార్థులు ఉన్నారు. మిగిలిన 98 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఆయా తరగతుల కోసం ప్రవేశం కోరే విద్యార్థులు 5 నుంచి 14 సంవత్సరాల వయసు ఉండాలి. సదరన్ క్యాంప్ ద్వారా పొందిన 40 శాతం అంధత్వ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. వీటితో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 80088 89815, 81434 61585, 80081 71524, 94900 10115, 94992 71392, 94907 37661లో సంప్రదించవచ్చు.

రైల్వే ఉద్యోగి నిజాయితీ


చిరంజీవికి పారితోషికం అందజేస్తున్న అరుణ

గుంతకల్లు: ప్లాట్‌ఫారంపై మరిచిపోయిన బ్యాగ్‌ను తిరిగి సంబంధీకురాలికి అందజేసి ఓ రైల్వే ఉద్యోగి నిజాయితీ చాటుకున్నాడు. జీఆర్‌పీ ఎస్ఐ మహేంద్ర తెలిపిన మేరకు... గుంతకల్లులోని బెంచికొట్టాలకు చెందిన చిరంజీవి ఏసీ కోచ్ క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి 8 గంటలకు బెంగుళూరు నుంచి భువనేశ్వర్ వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ కోచ్‌లను శుభ్రం చేసి కిందకు దిగిన చిరంజీవికి ప్లాట్‌ఫారంపై ఉన్న ఓ హ్యాండ్ బ్యాగ్‌ను గుర్తించి, సంబంధీకుల కోసం ఆరా తీశాడు. ఎవరూ స్పందించకపోవడంతో దానిని తీసుకెళ్లి జీఆర్‌పీ ఎస్ఐ మహేంద్రకు అందజేశాడు. అందులో రూ.3,300 నగదుతో పాటు ఓ బంగారం చైను, వెండి చైను ఉన్నట్లుగా గుర్తించిన రైల్వే పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారు. ఈ క్రమంలో గుంతకల్లులోని సిద్దేశ్వర్‌నగర్‌కు చెందిన సురేష్, అరుణ దంపతులకు చెందినవిగా గుర్తించి సమాచారం అందజేశారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడకు వెళ్తున్న బంధువులను కలిసేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చిన తాను... తిరిగి వెళ్లే సమయంలో హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయినట్లుగా ఈ సందర్భంగా రైల్వే పోలీసులకు అరుణ వివరణ ఇచ్చారు. నిజాయితీ చాటుకున్న చిరంజీవిని అభినందిస్తూ రూ.వెయ్యి పారితోషకాన్ని ఆమె అందజేశారు.

వజ్రం.. దొరికితే సంబరం

తొలకరి వర్షాలు ప్రారంభం కాగానే పొలాల్లో విత్తు సందడి మొదలవుతుంది. అయితే వజ్రకరూరులో మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఏటా మే, జూన్ మాసాల్లో తొలకరి వర్షాలు ప్రారంభమైన వెంటనే ఇక్కడ పొలాల్లో వజ్రాల వేట మొదలవుతుంది. స్థానికులతో పాటు కర్నూలు, శ్రీసత్యసాయి, వైఎస్సార్ జిల్లా వాసులు, కర్ణాటక , తెలంగాణ ప్రాంతాలకు చెందిన వందలాది మంది తరలి వచ్చి పొలాల బాట పడతారు. పిల్లాపాపలతో కలసి వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకూ వజ్రాల వేట కొనసాగిస్తారు. కాస్త రంగు రాయి కనిపిస్తే వెంటనే దానిని భద్రంగా తీసుకెళ్లి వ్యాపారి వద్ద తమ అదృష్టానికి వెల కట్టించి, డబ్బు తీసుకుని సంబరంగా ఇంటికి వెళుతుంటారు. – వజ్రకరూరు:


వజ్రాల కోసం అన్వేషిస్తున్న జనం
పొలంలోనే భోజనం చేస్తున్న దృశ్యం

ఆర్డీటీ సెట్‌లో సత్తా చాటిన 'గురుకుల' విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ (అంబేడ్కర్) గురుకులాల్లో చదివిన విద్యార్థులు ఆర్డీటీ సెట్‌లో సత్తా చాటారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉన్నత విద్య అభ్యసించాలనుకునే నిరుపేద విద్యార్థులకు ఇటీవల ఎంపిక పరీక్షను ఆర్డీటీ నిర్వహించి, ఫలితాలను వెల్లడించింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ గురుకుల పాఠశాలల్లో చదివి పదో తరగతి ఉత్తీర్ణులైన 26 మంది విద్యార్థులు ప్రతిభ చాటి ఎంపికయ్యారు. వీరికి ఆర్డీటీ నిధులు సమకూర్చి ఐఐటీ/నీట్ కోచింగ్‌తో కూడిన ఇంటర్ విద్యను వారు కోరుకున్న కార్పొరేట్ కళాశాలల ద్వారా అందజేయనుంది. ఈ మేరకు గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ అంగడి మురళీకృష్ణ సోమవారం తెలిపారు. ఎంపికైన వారిలో కురుగుంట గురుకుల పాఠశాల నుంచి 12 మంది, గుత్తి సమీపంలోని రజాపురం పాఠశాల నుంచి ఐదుగురు, హిందూపురంలోని గురుకులం నుంచి ఒకరు, కణేకల్లు గురుకులంలో ఇద్దరు, మలుగూరు నుంచి ఇద్దరు, నల్లమాడ నుంచి ఇద్దరు, రొళ్ల నుంచి ఇద్దరు విద్యార్థులున్నారు.

పత్తి చెట్ల నరికివేత


నరికివేసిన చెట్లను చూపుతున్న రైతు రామచంద్ర

గుమ్మఘట్ట: మండలంలోని భూపసముద్రంలో రైతు గొల్లపల్లి రామచంద్ర సాగు చేసిన పత్తి పంటను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నరికివేశారు. తనకున్న ఎకరా పొలంలో మూడు నెలల క్రితం పత్తి పంట సాగు చేశాడు. పంట ఏపుగా పెరిగి చెట్లకు కాయలు విపరీతంగా కాశాయి. దీంతో అప్పులన్నీ తీరిపోతాయని రైతు కుటుంబీకులు సంబరపడ్డారు. అయితే వారి ఆశలను అడియాసలు చేస్తూ ఆదివారం రాత్రికిరాత్రే పత్తి చెట్లను నరికివేశారు. అలాగే డ్రిప్ పైపులను ధ్వంసం చేశారు. సోమవారం ఉదయం తోటలోకి వెళ్లిన రామచంద్ర నేలరాలిన పంటను చూసి గుండెలవిసేలా రోదించాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతు రామచంద్ర తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి


మృతుడు రాజేష్

నార్పల: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... నార్పలలోని కొండంక వీధికి చెందిన రైతు లక్ష్మీపతి, సుహాసిని దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు రాజేష్ (17) అనంతపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం తమ్ముడితో కలసి తోటలోని బావి వద్దకు ఈత కొట్టేందుకు రాజేష్ వెళ్లాడు. గట్టు పట్టుకుని బావిలో దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడ్డాడు. అయితే ఈత రాకపోవడంతో నీట మునిగిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, బంధువులు హుటాహుటిన తోటలోని బావి వద్దకెళ్లి పరిశీలించారు. బావిలో దిగి గాలింపు చేపట్టి రాజేష్ మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

కూలిన ప్రహరీ - యువకుడి మృతి

- ఎద్దుకూ గాయాలు


అఖిల్(ఫైల్)

ఆత్మకూరు: ప్రహరీ కుప్పకూలడంతో శిథిలాల కింద చిక్కుకుని ఓ యువకుడు మృతి చెందాడు. ఓ ఎద్దు కూడా గాయపడింది. వివరాలు... ఆత్మకూరుకు చెందిన అంకె ఆంజనేయులు, ప్రమీల దంపతుల కుమారుడు అఖిల్ (18) ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఈ క్రమంలో తమకున్న రెండు ఎద్దుల్లో ఒకదానిని సోమవారం ఉదయం ఇంటి వద్దనే నీటితో శుభ్రం చేస్తుండగా పక్కనే ఉన్న ప్రహరీలో కొంత భాగం కూలింది. దీంతో ఎద్దుకు కట్టిన తాడును తప్పిస్తుండగా మిగిలిన ప్రహరీ సైతం కుప్పకూలింది. శిథిలాల కింద అఖిల్ చిక్కుకున్నాడు. గోడ కూలిన శబ్దానికి అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు వెంటనే సహాయక చర్యలు చేపట్టి శిథిలాల కింద చిక్కుకున్న అఖిల్ వెలికి తీశారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందాడు. ఎద్దు కాలికి బలమైన గాయం కావడంతో నడవలేక అక్కడే చతికిలబడింది. ఒక్కగానొక్క కొడుకు కళ్ల ముందే రక్తపు గాయాలతో విగతజీవిగా పడి ఉండడం చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు.

50వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ



అనంతపురం అగ్రికల్చర్: విత్తన పంపిణీ ప్రక్రియలో భాగంగా సోమవారం నాటికి 57,184 మంది రైతులకు 50,649 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాన్ని పంపిణీ చేసినట్లు జేడీఏ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇక 74,588 మంది రైతులు 65,866 క్వింటాళ్లకు ఆర్‌బీకే వేదికగా నమోదు చేసుకున్నారన్నారు. వేరుశనగతో పాటు విత్తన కందులు, మినుము, పెసలు, కొర్రలు, రాగులతో పాటు జనుము, జీలుగ లాంటి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు రాయితీ పోనూ తమ వాటా చెల్లించి పేర్లు నమోదు చేసుకుంటే త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

VOCATIONAL COURSES

■ LM & D (డైరీయింగ్ పశువిద్య) MLT, MPHW(F) C&T కోర్సులు కలవు. 2024 సం॥ అడ్మిషన్స్ జరుగుచున్నవి. అర్హత: 10th ఆపైన సంప్ర. సెల్ : 9985566783. [A-762308]

NURSING ADMISSIONS

■ ఇంటర్ పాస్ అయిన స్టూడెంట్స్‌కి B.Sc., (నర్సింగ్) B.Sc. (MLT), BPT (ఫిజియోథెరపీ), GNM (నర్సింగ్), DMLT (బ్లడ్ టెస్ట్), ఫ్రీ ఎడ్యుకేషన్, కాలేజీ లో హాస్టల్ కలదు. సంప్ర : జి.మురళీ, సెల్ : 9030661651, అనంతపురము. [A-140]

SERVICES

CHANGE OF NAME

■ I, DUDEKULA NOOR MAHAMMAD (Old Name) S/o SHAIK NABI SAB, D.No: 5-752, 5th Road, Anantapur Town & Dist., A.P. PIN-515001. Changing my name from DUDEKULA NOOR MAHAMMAD (Old Name). To SHAIK NOOR MAHAMMAD (New Name). Henceforth I am being called as SHAIK NOOR MAHAMMAD for all purposes. [A-338]

WANTED

■ Mindzo ఎడ్యుకేషనల్ సర్వీసెస్ నందు, టెలికాలర్ ఉద్యోగాలు. ఇంటర్వ్యూలు జరుగుచున్నవి. జీతం: 10,000 - 15,000. సెల్:8686181839. [A-146]

■ రెడీమేడ్ షోరూమ్ (జీన్స్ + షర్ట్స్) సేల్ చేయుటకు సేల్స్ మెన్ కావలెను. జీతం:10 వేలు. టైమింగ్:9AM to 9PM. అడ్రస్ # STYLE జెంట్స్ వేర్, డ్రస్ సర్కిల్ లైన్ కమలానగర్,ATP. [A-147]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217. [M-1185097]

■ మా కంపెనీ కొరకు (65 మంది) స్త్రీలు, (80 మంది) పురుషులు & టెలికాలర్స్ F అర్జెంటుగా కావలెను. ఫ్రీ రూమ్ + భోజనం+26000/- వరకు స్పాట్ జాయినింగ్ డైరెక్ట్ జాబ్స్. ఫోన్: 8886733005 [HA-10857]

■ ఒమేగాహోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్ ను, పిల్లలను చూసుకొనుటకు, వంట/ఇంటి పనికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 20K. Ph: 8977639622, 8977639663 [HA-197]

■ IIT ఫౌండేషన్ (మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) స్పోకెన్ ఇంగ్లీష్ టీచర్స్ అర్జెంటుగా కావలెను. ఆకర్షణీయమైన జీతం. # S.E.S. స్కూల్, శిరిగుప్ప, బళ్ళారి జిల్లా. సెల్ : 8888110764, 9949990888. [A-142]

■ REQUIRED TEACHERS TO TEACH PRIMARY SECTIONS FROM NURSERY TO 5th CLASS FOR ALL SUBJECTS. SALARY: 10,000/- TO 15,000/-. INTERVIEW DATE : 8th, 9th AND 10th JUNE, 2024. CONTACT: 8522842936, 8019855845. [A-7299]

■ అనంతపురము జిల్లా వ్యాప్తంగా మా కంపెనీకి ఎలక్ట్రీషియన్స్ కావలెను. Q : ITI/ ఎలక్ట్రికల్ వర్క్ అనుభవం ఉన్నవారు వెంటనే ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. అడ్రస్ : జెప్టిక్ కన్‌స్ట్రక్షన్ ప్రై॥లి॥. హోటల్ నవీద్ రెసిడెన్సీ, శ్రీ కంఠం సర్కిల్, రాజు రోడ్డు, ATP. 9014981414, 9059451164. [A-138]

■ Wanted Gorantla, Sri Satyasai dist, To Work in New montessori E/M School, Teahcers are Required to Teach English, Hindi, Science (P.S) From 6th to 10th. Residential Teachers are prefered. Salary 15000 to 20000/- Hostel facility is Available for Residential Teachers Cont: 9441904509. [C-800260]

■ WANTED TEACHERS: To teach English, Hindi, Maths, EVS Subjects, for 1 to 5th English Medium Classes. And also Wanted English, Hindi, Maths Subjects for 6 to 10th English Medium Classes. Daily travelling teachers (30KM) TA extra with salary. Contact: VIGNAN EM HIGH SCHOOL, SOMANDEPALLI, Near PENUKONDA, Sri Sathya Sai (Dist)., A.P. Cell: 8309913221, 9347986668. [A-1238]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి



లక్ష్మీనగర్‌లో పడిపోయిన చెట్లను తొలగించేలా చర్యలు తీసుకుంటున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: వర్షా ప్రభావిత ప్రాంతాల్లో మేయర్ వసీం సోమవారం పర్యటించారు. లక్ష్మీనగర్, కోవూర్‌లో పర్యటించిన ఆయన పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు. ఈనెల 2న రాత్రి కురిసిన వర్షానికి నేలకూలిన చెట్లను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఎప్పటికప్పుడు పడిపోయిన చెట్ల కొమ్మలను తొలగించేలని ఎన్విరాన్‌మెంట్, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యుత్‌శాఖ అధికారులను సమన్వయం చేసుకుని కరెంటు తీగలకు ఆనుకుని ఉన్న కొమ్మలను తొలగించాలన్నారు. అదేవిధంగా వర్షాకాలంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వారంలో ఒక రోజు డ్రై డేను పాటించి, ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకూడదన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా చెత్తను నగరపాలక సంస్థ సిబ్బందికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతకుంట మధు, ఏ1రఫీ, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

హరికిషోర్ సాహితీ సేవలు అభినందనీయం



కరణం హరికిషోర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం/అనంతపురం కల్చరల్: యువ రచయితగా, కవిగా హరికిషోర్ సాహితీ సేవలు అభినందనీయమని రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పతికి రమేష్ నారాయణ అన్నారు. శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ద్వారా భీమవరం వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో విజేతగా నిలిచిన అనంత వాసి కరణం హరికిషోర్‌ను జిల్లా ఉమర్ ఆలీషా సాహితీ సమితి ఆధ్వర్యంలో సత్కరించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆశుకవి రియాజుద్దీన్ అహమద్ అధ్యక్షతన జరిగిన అభినందన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రమేష్ నారాయణ డాక్టర్ ఉమర్ ఆలీషా సద్గురువుల విలక్షణ జీవితాన్ని, సేవాతత్పరతపై మాట్లాడారు. భీమవరం వారు ఉమర్ ఆలీషా విరచిత 'విషాద సౌందర్యం' నాటికపై పోటీలు పెడితే రాష్ట్రస్థాయిలో అనంత వాసి ఉత్తమ ప్రతిభ కనపరచడం స్ఫూర్తిదాయకమన్నారు. అదే విధంగా జిల్లా ఉమర్ ఆలీషా సాహితీ సమితి ప్రతినిధులు మురళీకృష్ణ, డాక్టర్ నగరూరు రసూల్, తోట నాగరాజు, అర్బన్‌బ్యాంక్ డైరెక్టర్ సుంకర రమేష్ తదితరులు ఉమర్ ఆలీషా సామాజిక, సాహితీ సేవలను ప్రశంసించారు. అనంతరం పీఠాధిపతుల ద్వారా విచ్చేసిన ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందించి హరికిషోర్‌ను సత్కరించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



చెన్నేకొత్తపల్లిలో మైక్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం మండలంలో ఎక్కడైనా గొడలకు పాల్పడినా.. ప్రేరేపించినా అలాంటి వారిని గుర్తించి వారిని కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గత మూడు రోజులుగా మండల వ్యాప్తంగా ఆటోల్లో మైక్‌లు ఏర్పాటు చేసుకుని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో గెలిచిన వారు ఇతరులను రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా కాల్చడం నిషేధించడం జరిగిందన్నారు. మండల వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటాయన్నారు. ప్రజలు ఎక్కడా గుంపులుగా చేరరాదన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవన్నారు. మండల ప్రజలు పోలీసులకు సహకరించి శాంతియుతంగా ఉండాలని సూచించారు.

యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని యంగన్నపల్లి శివారులో సోమవారం ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టడంతో నవీన్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. బేతాపల్లికి చెందిన నవీన్ గుత్తి వైపు వెళ్తూ ముందు వెళ్తున్న మరో బైక్‌ను కొన్నాడు. తీవ్రంగా గాయపడిన నవీన్‌ను స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శారదానగర్ తదితర కాలనీల ప్రజలు బయటకు రాకుండా బారికేడ్లు, ఇనుప కంచె ఏర్పాటు



జేఎన్‌టీయూ కళాశాలలోకి వెళ్తున్న వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



ఇనుప కంచెలో నుంచి దూరి వస్తున్న వృద్ధురాలు

భద్రత కట్టుదిట్టం..

ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఈ మేరకు నగరంలోని జేఎన్‌టీయూలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు, బాడీ వార్న్ కెమెరాలు, పోలీసు నిఘా నీడన మంగళవారం ఓట్ల లెక్కింపు పకడ్బందీగా జరగనుంది. మరో వైపు జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం సర్కిల్ మన్రో విగ్రహం వద్ద నుంచి కౌంటింగ్ కేంద్రం వరకు ఎక్కడికక్కడ భద్రత చర్యలు చేపట్టారు. జేఎన్‌టీయూ కళాశాలకు పక్కన ఉన్న శారదానగర్ తదితర కాలనీల ప్రజలు బయటకు రాకుండా బారికేడ్లు, ఇనుప కంచె ఏర్పాటు చేశారు. జేఎన్‌టీయూ కళాశాలలోకి వెళ్తున్న వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపుతున్నారు.



కారుపై సీసీ కెమెరా ఏర్పాటు చేసిన పోలీసులు

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



జేఎన్‌టీయూ ప్రహరీపై ఇనుప కంచె ఏర్పాటు చేసిన దృశ్యం



పాల వ్యాపారుల అవస్థలు



ప్రజలు వెళ్లకుండా ఇనుప కంచె ఏర్పాటు

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- జేఎన్‌టీయూ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి
- 21 రౌండ్లలో ఓట్ల కౌంటింగ్
- రాత్రి 8 గంటల తర్వాత రాప్తాడు ఫలితం
- ఎక్కడ చూసినా అభ్యర్థుల గెలుపోటములపైనే చర్చ

నియోజకవర్గం	రాప్తాడు
మండలాలు	6
పోలింగ్ కేంద్రాలు	279
మొత్తం ఓటర్లు	2,50,571
పోలైన ఓట్లు	2,13,207
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	4,338
ఏర్పాటు చేసిన టేబుళ్లు	14
కౌంటింగ్ రౌండ్లు	21

ఓట్లు లెక్కించే ప్రదేశం: జేఎన్‌టీయూ, 1వ అంతస్తు, ఈసీహెచ్‌ఓ గది, అనంతపురం



జేఎన్‌టీయూలో ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాటు చేసిన టేబుళ్లు

రాప్తాడు/ఆత్మకూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ గడువు సమీపిస్తున్న కొద్దీ ప్రతి ఒక్కరిలో ఉత్కంఠ పెరుగుతోంది. పట్టణాలు, పల్లెల్లో ఎక్కడా చూసినా కౌంటింగ్ పైనే చర్చ నడుస్తోంది. ఇద్దరు ఒక చోట కలిస్తే చాలు విజయం ఎవరిని వరిస్తుందనే అంశంపైనే జోరుగా విశ్లేషణలు సాగుతున్నాయి. పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములపై భారీగా బెట్టింగ్ జరుగుతోంది. గత 22 రోజులుగా అభ్యర్థులతో పాటు ఓటర్లంతా ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ఓట్ల లెక్కింపు మంగళవారం జరగనుంది. అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. రాప్తాడు నియోజవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు అనంతపురం రూరల్ మండలంలోని జేఎన్‌టీయూ కళాశాలలో నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత సార్వత్రిక ఎన్నికల పోలింగ్ 2019 ఏప్రిల్ 11న జరిగితే ఫలితాల కోసం 41 రోజుల పాటు ఎదురు చూడాల్సి వచ్చింది. ఈసారి కేవలం 22 రోజుల్లో ఫలితాలు వెలువడనున్నాయి.

కౌంట్‌డౌన్ ప్రారంభం..

ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. మంగళవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుంది. ఫలితాలపై అటు అభ్యర్థులతో పాటు ఇటు ప్రజల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గంలో 281 పోలింగ్ బూత్‌లలో ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు మరో 5 టేబుళ్లు, ఇంకొక టేబుల్ వద్ద సర్వీస్ ఎంప్లాయీస్ ఓట్లు లెక్కించేలా ఏర్పాట్లు చేశారు. మొత్తం 21 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. నియోజకవర్గంలో 2,13,207 ఓట్లు పోలయ్యాయి. 281 పోలింగ్ స్టేషన్లు ఉండగా.. వాటిలో రౌండ్‌కు 14 పీఎస్‌ల ఓట్లను లెక్కిస్తారు. ఇలా 21 రౌండ్లలో 281 పీఎస్‌ల ఓట్లు లెక్కిస్తారు. 4,338 పోస్టల్ బ్యాలెట్లు ఓట్లు పోల్ కాగా.. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు.

102 మంది సిబ్బంది కేటాయింపు..

జేఎన్‌టీయూలోని 1వ అంతస్తులో ఈసీహెచ్‌ఓ గదిలో కౌంటింగ్ ప్రక్రియ కోసం ఆర్‌ఓ వసంత బాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. అసెంబ్లీకి 14 టేబుళ్లు, పార్లమెంటుకు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క టేబుల్ వద్ద విధుల నిర్వహణ కోసం ముగ్గురిని నియమించారు. దాదాపు 102 మంది సిబ్బందిని కౌంటింగ్ కేంద్రంలో నియమించారు. కౌంటింగ్ విధుల కోసం నియమించిన సిబ్బంది మంగళవారం ఉదయం నాలుగు గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి. అప్పటి నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుంది. స్ట్రాంగ్ రూమ్ వద్ద నుంచి ఈ ప్రక్రియ శ్రీకారం చూడతారు. ఉదయం 7:40 నుంచి ఎనిమిది గంటలకు వరకు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రంగా ఉన్న ఈవీఎంలను కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన టేబుళ్ల వద్దకు తీసుకెళ్తారు. ఈ ఈవీఎంలను వివరాలను స్ట్రాంగ్ రూమ్ వద్ద ఉన్న లాగ్‌బుక్ వద్ద నమోదు చేస్తారు. ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్లను లెక్కిస్తారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతుంది. అరగంట వ్యవధిలో ఈ బ్యాలెట్ల లెక్కింపు పూర్తి కాకున్నా, కచ్చితంగా ఉదయం 8:30 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభిస్తారు. ఒక్కో రౌండ్‌కు సుమారు అన్ని రకాల విధానాలు పూర్తయ్యే సరికి అర గంట వరకు పడుతుంది. లెక్కింపు పూర్తయిన ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌కు చేరాక, తిరిగి కొత్త ఈవీఎంలను కౌంటింగ్ పాయింట్‌కు తీసుకువస్తారు. ఒక్కో టేబుల్ దగ్గర ఒకటో నంబర్ ఈవీఎం వస్తే, తిరిగి రెండో రౌండ్‌కు 15 నుంచి ప్రారంభమవుతుంది.

మళ్లీ ఫ్యాన్ గాలి వీచే అవకాశం..

నియోజకవర్గంలో మళ్లీ ఫ్యాన్ గాలి బలంగా వీచే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మహిళలు వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసినట్లు సమాచారం. సీఎం జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలే ఓటింగ్ శాతం పెరగడానికి కారణమని వైఎస్సార్‌సీపీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇది ఇలా ఉండగా తమ పార్టీ అధికారంలోకి వస్తుంది అంటే తమ పార్టీ అధికారంలోకి వస్తుందని వైఎస్సార్‌సీపీ, టీడీపీకి చెందిన అభిమానులు బెట్టింగ్‌లు వేసుకుంటున్నారు.

గతంలో 25,575 ఓట్ల మెజార్టీ..

గత ఎన్నికల్లో పరిటాల శ్రీరామ్‌పై తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి 25,575 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ 6,418, అనంతపురం రూరల్ వైఎస్సార్‌సీపీకి 10,320, రాప్తాడు వైఎస్సార్‌సీపీకి 4,883, కనగానపల్లి వైఎస్సార్‌సీపీకి 1,233, రామగిరి టీడీపీకి 2,255, చెన్నేకొత్తపల్లి వైఎస్సార్‌సీపీకి 4,731, పోస్టల్ బ్యాలెట్ 466 మెజార్టీ వచ్చాయి. గత ఎన్నికల్లో ఆరు మండలాల్లో ఒక్క రామగిరి మినహా మిగిలిన ఐదు మండలాల్లో వైఎస్సార్‌సీపీకి మెజార్టీ వచ్చింది. ఈ ఎన్నికల్లో కూడా రాప్తాడులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు, ప్రజలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోసారి జగన్ ముఖ్యమంత్రి అవుతారని చెబుతున్నారు.

పరవళ్లు తొక్కుతున్న పండమేరు వంక



రాప్తాడు మండలం అయ్యవారిపల్లి వద్ద పారుతున్న పండమేరు వంక



గంగమ్మకు పూజలు చేస్తున్న సర్పంచ్ సాకే తిరుపాలు, గ్రామస్తులు

రాప్తాడు: నియోజకవర్గంలో గత పది రోజులుగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. రెండు, మూడు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పండమేరు వంక పొంగి పొర్లుతోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షపు నీటి ప్రవాహంతో పండమేరు వంకకు జలకళ వచ్చింది. రాప్తాడు మీదుగా అనంతపురం చెరువులోకి నీరు చేరుతోంది. మండలంలో పంటలు ఎండుతుండటంతో ఆందోళన చెందుతున్న రైతులకు ఈ వర్షంతో ఉపశమనం లభించింది. రామగిరి, కనగానపల్లి మండలాల్లో నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో పండమేరు వంక నాలుగు అడుగుల నీరు ప్రవహిస్తోంది. మండలంలో వరిమడుగు, గాండ్లపర్తి గ్రామాల సమీపంలోని వంకలో ఉదయం వాహన రాకపోకలు స్తంభించిపోయాయి. సాయంత్రానికి ఉధృతి తగ్గడంతో వాహనాల రాకపోకలు సాగాయి. ఈ వంక ప్రవహించడంతో ఆయా గ్రామాల్లోని చెరువుల్లోకి నీరు చేరింది. ఈ వంక రెండు రోజులు ప్రవహిస్తే రాప్తాడు మీదుగా అనంతపురం చెరువులోకి నీరు భారీగా చేరుతుందని రాప్తాడు గ్రామస్తులు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న వంకలు, వాగులు, కుంటలు, చెక్కు డ్యామ్‌లు పొంగి పొర్లుతున్నాయి. రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు ఆధ్వర్యంలో గ్రామస్తులు గంగమ్మకు ప్రత్యేక పూజలు చేపట్టారు.

హద్దు మీరితే రౌడీషీట్లు తెరుస్తాం

- అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి



రాప్తాడు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు. అలాంటి వారిపై కేసులు నమోదు చేసి రౌడీషీటర్ ఓపెన్ చేస్తామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతపురం రూరల్ డివిజన్ పరిధిలోని రాప్తాడు, శింగనమల నియోజకవర్గ గ్రామాల్లో జూన్ 9 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ఫలితాలను స్వీకరించాలన్నారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు మినహా ఎవరూ కూడా అనంతపురం నగరంలోకి రాకూడదన్నారు. ఎవరైనా అనారోగ్య సమస్యలతో బాధపడే వారు, అత్యవసర పనుల నిమిత్తం వచ్చే వారు మాత్రమే నగరంలోకి రావాలన్నారు. కక్షలతో సాధించేది ఏమి లేదని, కేసుల్లో ఇరుక్కోవడం ఖాయమని హెచ్చరించారు. ప్రజలు నలుగురు కన్నా ఎక్కువ మంది గుంపులుగా చేరి, అల్లర్లు గొడవలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. 30 పోలీసు యాక్ట్ కూడా అమలులో ఉందని తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. కౌంటింగ్ రోజు ఏ పార్టీ విజయం సాధించినా బాణాసంచా కాల్చడం చేయరాదన్నారు. బైక్‌ల సైలెన్సర్ తీసి, వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, మఫ్టీ పోలీసులతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా లాడ్జీలు, కళ్యాణ మండపాల్లో రూంలు తీసుకున్నా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టకూడదన్నారు. ఎవరైనా పోస్టులు పెడితే వారికి సంబంధించిన పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రజలు స్వచ్ఛందంగా 100కు గానీ, పోలీసులకు గానీ ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

మండల వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు

చెన్నేకొత్తపల్లి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెల్లడికానున్నాయి. మండలంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే గ్రామాల్లో పర్యటించి గొడవలకు దూరంగా ఉండాలని ప్రజలు అవగాహన కల్పించామన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తరువాత ఎలాంటి గొడవలకు పాల్పడినా.. గొడవలు జరిగేలా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మండలంలో ఎక్కడా ఎలాంటి అల్లర్లకు తావులేకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో 10 చోట్ల పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. గొడవలు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం అందిన వెంటనే గ్రామాలకు వెళ్లేలా 3 క్విక్ రెస్పాండ్ టీం (త్వరగా స్పందించే టీం)లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే ప్రత్యేక పోలీసు బలగాలతో మండలంలో పర్యటిస్తూ ఉంటామన్నారు. గ్రామాల్లో అల్లర్లు జరిగే అవకాశం ఉంటే ముందుగా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



చెన్నేకొత్తపల్లి కూడలిలో పోలీసుల పహారా

ఇద్దరు జిల్లా బహిష్కరణ

ఎన్నికల ఫలితాలు రానుండటంతో మండలంలో ఎక్కడా ఎలాంటి గొడవలకు జరగకుండా ముందు జాగ్రత్తగా ఇద్దరిని జిల్లా బహిష్కరణ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వీరి కదలికలపై గట్టి నిఘా ఉంటుందన్నారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవంపై ర్యాలీ

యాడికి: మండల కేంద్రంలో మలేరియాకు వ్యతిరేకంగా వైద్య సిబ్బందితో కలసి యాడికి పీహెచ్‌సీ వైద్యులు శ్రీరామ్ కుమార్, పరమేశ్వర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దోమల నివారణకు ఇంటి ముందు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు., ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా జూన్ 1 నుంచి 30వ తేదీ వరకూ మండలంలోని అన్ని గ్రామ్లాలో ప్రజలకు అగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసులు, రాం ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ నివారణకు కృషి

బుక్కరాయసముద్రం: గ్రామీణ ప్రాంతాల్లో ఫ్లోరైడ్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని జిల్లా ఎన్సీడీ అధికారి డాక్టర్ నారాయణస్వామి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో డాక్టర్ స్వాతి లక్ష్మి ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాలను అందజేశారు. అనంతరం ఫ్లోరైడ్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మోహన్‌రావు, పీహెచ్‌ఎన్ చెన్నమ్మ, నాగలక్ష్మి, ఈశ్వరమ్మ, సత్య నారాయణ, ధనుంజయ, ఆనంద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నాగేంద్ర మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని పల్లెన్నగారిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందారు. నాగేంద్రరెడ్డి కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఓబిరెడ్డి క్యాన్సర్‌తో బాధపడుతూ మృతి చెందాడు. స్థానిక నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం ఉదయం గ్రామానికి చేరుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాగేంద్రరెడ్డి, ఓబిరెడ్డి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని సంతాపం తెలిపారు.

జెడ్పీటీసీకి పరామర్శ..

కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న చెన్నేకొత్తపల్లి జెడ్పీటీసీ గోవిందరెడ్డిని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పరామర్శించారు. సోమవారం ఉదయం ప్రసన్నాయపేటలోని జెడ్పీటీసీ స్వగృహానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నర్సిరెడ్డి, ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, మాడెం ప్రకాష్‌రెడ్డి, మనేరు నరసింహులు, ఓబుళేసు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అనవసరంగా ఇళ్ల నుంచి బయటకు రావొద్దు

రాప్తాడురూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా ఏదైనా అత్యవసరం ఉంటే తప్ప మంగళవారం ఇళ్ల నుంచి ఎవరూ బయటకు రావొద్దని అనంతపురం రూరల్, ఇటుకలపల్లి పోలీసులు సూచించారు. ఈ మేరకు రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, ఇటుకలపల్లి పీఎస్ ఎస్‌ఐ రాఘవేంద్రరెడ్డి వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. రూరల్ మండల పరిధిలోని గ్రామాల ప్రజలు ఏదైనా ముఖ్యమైన పని ఉంటేనే నగరానికి వెళ్లాలని సూచించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎవరైనా కనిపిస్తే సీసీ కెమెరాల ద్వారా గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గ్రామాల్లో టపాసులు కాల్చరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్కడా కూడా నలుగురు కంటే ఎక్కువగా జనాలు కనిపించకూడదన్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కించపరిచే పోస్టులు చేసినా, స్టేటస్‌గా పెట్టుకున్నా, అడ్మిన్‌పై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. క్రిమినల్ కేసులు నమోదు చేసి రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు.

7న రేణుకా యల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని జీసెస్ నగర్‌లో రేణుకా యల్లమ్మ తల్లి ఆలయ 25వ వార్షికోత్సవం ఈనెల 7 నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం గణపతి, నవగ్రహ పూజలు, సామూహిక లలితా కుంకుమార్చన, సాంస్కృతిక కార్యక్రమాలు, శనివారం 108 దుర్గాసూక్తములతో అభిషేకం, చండీ రుద్ర హోమాలు, ఆదివారం ఆలయ వార్షికోత్సవ ముగింపు వేడుకల్లో భాగంగా 108 సూక్తములతో అభిషేకం, మహాపూర్ణాహుతి, మహా అన్నదాన కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా గణితం బోధించేందుకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రశాంతి కోరారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎమ్మెస్సీ (మ్యాథ్స్) పూర్తి చేసిన వారు ఈ పోస్టుకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల పదో తేదీ ఉదయం 11 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూలో పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 97031 51381 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

బుక్కరాయసముద్రం: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన ఈదురు గాలులు, వర్షాలకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండల కేంద్రంలో 9 విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో బీకేఎస్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ట్రాన్స్‌కో ఏఈ ప్రతాప్‌కుమార్ ప్రత్యేక బృందంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724, 9010223702, 9010567770, 9010588846, 9912220727